క్లుప్తంగా

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని బారాషహీద్ దర్గా సమీపంలో సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయండి



మనుబోలు : జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్ పురోగతిపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా జల్‌జీవన్ పనులు జరుగుతాయని తెలిపారు. ఇందు కోసం కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీల్లో తొమ్మిది మంది పొదుపు సభ్యులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారని వివరించారు. ప్రస్తుతం మండలంలోని ఎనిమిది గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నట్లు తెలియజేశారు. పనుల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జల్‌జీవన్ మిషన్ కోఆర్డినేటర్ శర్మ, ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఎం వనజాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రంలో వర్సిటీ బోర్డు సభ్యులు



పొదలకూరు : ఎన్జీరంగా వర్సిటీ బోర్డు సభ్యులు బి.శ్రీనివాసులురెడ్డి, ఎం.మల్లికార్జున రెడ్డి పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగు వివరాలను ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. నీటి వసతి తక్కువగా ఉన్న కారణంగా పంటల సాగు అనుకున్న స్థాయిలో చేపట్ట లేకపోయినట్లు వెల్లడించారు. ఇక్కడే ఉన్న వ్యవసాయ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ వసతి గృహాన్ని బోర్డు సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థినులతో సమావేశమై వసతుల గురించి తెలుసుకున్నారు. విత్తన శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అవసరమైన మినుము, పెసర విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. విత్తనాల నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పరిశోధన స్థానంలోని శాస్త్రవేత్తలు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మనుబోలు : మనుబోలులో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చిరంజీవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుబోలు పరిధిలో ఉన్న పది పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉన్నాయా.. లేదా? అని పరిశీలించామని, ఇక్కడ తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర వసతులను సమకూర్చినట్లు తెలిపారు. అలాగే వృద్ధులు, దివ్యాంగులు సులభంగా చేరుకునేందుకు వీలుగా ర్యాంప్‌లు లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట మనుబోలు వీఆర్వో నాగార్జునరెడ్డి ఉన్నారు.

కసుమూరులో ఉచిత వైద్య శిబిరం



వెంకటాచలం : మండలంలోని కసుమూరు గ్రామ సచివాలయంలో అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ నవీన్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్యుడు గౌతమ్‌రెడ్డి, ఇతర సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఆరోగ్య నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఆదాల గెలుపునకు సమష్టి కృషి



మాట్లాడుతున్న రంగారెడ్డి

నెల్లూరు రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేసి అత్యధిక మెజార్టీ సాధిస్తామని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఎంపీ ఆదాల ఆదేశాల మేరకు నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేత వైవీ రామిరెడ్డి, మేయర్ స్రవంతి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని మాట్లాడారు. ఓటమి భయంతో ప్రతిపక్ష నాయకులు డ్రామాలు ఆడుతున్నారన్నారు. అక్రమాలు, దౌర్జన్యాలు చేసే కోటంరెడ్డి సోదరులకు ఎన్నికల్లో తగిన రీతిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే రూరల్‌లో అరాచకాలను పూర్తిగా అణచివేశారన్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి ఆదాలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు



మాట్లాడుతున్న
సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు(వేదాయపాళెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు ఇస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వామపక్ష నేతలు మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల శ్రమను కార్పొరేట్ శక్తులు దోచుకునేలా కేంద్రం కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతు రుణాలను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లు, గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లాలకు ప్రధాన నీటి వనరైన సోమశిల ఆప్రాన్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని నిర్వహించే గ్రామీణ, పారిశ్రామిక బంద్ సందర్భంగా జరిగే నిరసన ప్రదర్శనల్లో రైతులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు లక్ష్మిరెడ్డి, సీపీఎం నేతలు మస్తాన్‌బీ, నాగేశ్వరరావు, బత్తల కృష్ణయ్య, సీపీఐ నేత షానవాజ్, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛపై అవగాహన సదస్సు



నెల్లూరు సిటీ: అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతారెడ్డిపాళెంలోని నారాయణ మెడికల్ కళాశాలలో న్యూరాలజీ డాక్టర్ ఎస్ఎస్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నారాయణ ఆస్పత్రి సూపరింటెండెంట్ బీ హరిప్రసాద్‌రెడ్డి, న్యూరాలజిస్ట్ అనూష, నెఫ్రాలజిస్ట్ ప్రవీణ్‌కుమార్, ఎండోక్రైనాలజిస్ట్ సునంద, ఏజీఎం శేఖర్‌రెడ్డి, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): నెల్లూరుకు విచ్చేసిన డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత రక్షణ మంత్రిత్వ శాఖ ముఖ్యసలహాదారులు గుండ్రా సతీష్‌రెడ్డిని నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సతీష్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు.

స్టోన్‌హౌస్‌పేటలో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బాలాజీనగర్ నుంచి స్టోన్‌హౌస్‌పేటకు మార్చారు. ఇక్కడి రేబాల వారివీధిలోని లక్ష్మీనరసారెడ్డి చిన్నపిల్లల ఆస్పత్రి క్వార్టర్స్‌లో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కార్యకలాపాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి.

రేపు ఉచిత అక్షరాభ్యాసం

నెల్లూరు(బృందావనం): శ్రీపంచమిని పురస్కరించుకుని బాలాజీనగర్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కురవాడ లలితమ్మ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసం ఉచితంగా చేయనున్నట్లు ఆలూరు శిరోమణిశర్మ సోమవారం తెలిపారు. అక్షరాభ్యాసం సందర్భంగా పలక, బలపం అందజేయనున్నట్లు చెప్పారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించదలచిన తల్లిదండ్రులు 94913 53229 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని వినతి



నెల్లూరు(దర్గామిట్ట): వీఆర్‌ఏల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఆ సంఘ రాష్ట్రాధ్యక్షుడు మర్రి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు జానీ కోరారు. ఈ మేరకు విజయవాడలో ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డిని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వీఆర్‌ఏలకు రూ.15వేలు వేతనం ఇవ్వాలని, 60 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులను వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా రెగ్యులర్ చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలను వీఆర్వో, వాచ్‌మెన్, అటెండర్లుగా పదోన్నతి కల్పించాలనే డిమాండ్‌లను మంత్రుల కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్పందించిన వెంకటరామిరెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించేందుకు విభాగాధిపతులు చొరవ చూపాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అదనపు కమిషనర్ పాల్గొని నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనకు రెవెన్యూ 4, ఇంజినీరింగ్ 9, పట్టణ ప్రణాళిక 6, హౌసింగ్ 5, ప్రజారోగ్యం 2 చొప్పున మొత్తం 26 అర్జీలు అందాయని అదనపు కమిషనర్ తెలిపారు. తొలుత గత వారం అర్జీల పరిష్కారంపై ఆమె సమీక్షించారు. అర్జీలను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్సు చేయాలని ఆదేశించారు. నగరంలోని 167 సచివాలయాల్లోనూ ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని, కార్యదర్శులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి



బీపీ చెక్ చేయించుకుంటున్న
ఉపరవాణా కమిషనర్ చందర్

నెల్లూరు (టౌన్): డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఉపరవాణా కమిషనర్ చందర్ సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. తొలుత ఎనెల్ ఆస్పత్రి చైర్మన్ నాగేంద్రప్రసాద్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపరవాణా కమిషనర్ చందర్ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రి కంటి వైద్యులు అరుణ, వేదాయపాళెం ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యులు సుమయ, ఎనెల్ ఆస్పత్రి వైద్యుడు హరికృష్ణ, దావూద్, ఎంవీఐలు మురళీమోహన్, బాలమురళీకృష్ణ, బాబు, కార్తీక్, పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ కాలేషాబాషా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన డార్విన్ జయంతి సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా 'జీవ పరిణామమా..సృష్టా' అనే అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ కాలేషాబాషా పాల్గొని మాట్లాడారు. నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వాలు పాఠ్యాంశాల నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించి విద్యార్థులను పరోక్షంగా సృష్టివాదం వైపు మళ్లించే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. విద్యార్థుల్లో, ప్రజల్లో ఉన్న సృష్టివాద భ్రమలను తొలగించి పరిణామవాద సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.సమస్త జీవరాశులను ఎవ్వరూ సృష్టించలేదని, పరిణామం ద్వారా అభివృద్ధి చెందాయని డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం వెల్లడించిందన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. నగరంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలపతి ,డా.శ్రీనునాయక్, హరిబాబు, డా.ఎండీ రఫీ, నగేష్, జేవీ నగరాధ్యక్షుడు విజయ్‌కుమార్, మురళి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మిని దర్శించుకున్న సతీష్‌రెడ్డి



నెల్లూరు(బృందావనం): నగరంలోని సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలో కొలువైన అష్టలక్ష్మిని భారత రక్షణ శాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు మస్తాన్‌రెడ్డి, ప్రవీణ్, కొల్లం సురేష్ తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సతీష్‌రెడ్డికి ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఖలీల్‌అహ్మద్

- నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్ కోరారు. నగరంలోని కపాడిపాళెంలోని కమ్యూనిటీహాల్‌లో 51వ డివిజన్, మూలాపేటలోని జంగమభవన్‌లో 39, 40 డివిజన్లకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీ అయిన తనకు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా అవకాశం కల్పించారన్నారు. ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ కాయల సాహిత్య, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, పార్టీ నాయకులు మానికల సునీల్, నూనె ప్రసాద్, మిద్దె మురళీకృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రామకృష్ణాచారి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు సీసీఎస్ డీఎస్పీగా పీ రామకృష్ణాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ జిల్లాలో నేరాల కట్టడికి తనవంతు కృషి చేస్తామన్నారు. నేరస్తుల కదలికలపై నిశిత నిఘా పెడుతామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులు తమ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు ప్రజలు గుర్తిస్తే డయల్ 112 లేదా సీసీఎస్ పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా డీఎస్పీ పీ రామకృష్ణాచారిది అనంతపురం జిల్లా. ఆయన 1995లో పోలీసుశాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లాలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వహించారు. ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు. పనిచేసిన ప్రతిచోట శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు వీడ్కోలు



ధర్మకర్తల మండలి సభ్యులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడంతో వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి పాల్గొని మాట్లాడారు. దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తల మండలి చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త ఆర్ జయరామ్, సభ్యులు జీ దొరబాబు, ఎం రామమోహన్‌రెడ్డి, కే సతీష్, ఎస్ విజయకుమార్‌రెడ్డి, ఎస్ పెంచలమ్మ, సీహెచ్ భారతి ఎంతో తోడ్పాటును అందించారన్నారు. అనంతరం వారిని సత్కరించారు. ఆలయ ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి మూడ్రోజుల పాటు పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న మహాగణపతిపూజ, తీర్థ సంగ్రహణం, విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 17న అష్టబంధన సమర్పణ, విశేష సుబ్రహ్మణ్యేశ్వర సహిత సర్వమంత్ర హోమం, జంట నాగదేవతలకు అభిషేకం, మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న రుద్ర హోమం, పూర్ణాహుతి, ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 36 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శిల్పానికి మహాకుంభాభిషేక పూజలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, మయూర వాహన సేవ ఉంటాయని వివరించారు.

కేంద్ర పథకాలను స్వద్వినియోగం చేసుకోవాలి



నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఏసీనగర్, మల్లెల సంజీవయ్య మున్సిపల్ పాఠశాల, హరనాథపురం సెంటర్ సమీపంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వికసిత్‌భారత్ సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఇరిగేంద్రబాబు, ప్రవీణ్‌రెడ్డి, రవిశంకర్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్సై మృతికి సంతాపం



నెల్లూరు(క్రైమ్): వింజమూరు పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న వై సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కావలిలోని రామస్వామి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. కావలిలోని వాయునందనపురంలోని స్వగృహంలో ఉంచిన ఆయన మృతదేహాన్ని ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వై శ్రీహరి, కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ, కలిగిరి సీఐ ఎండీ ఫిరోజ్, వింజమూరు ఎస్సై కోటిరెడ్డి, పలువురు పోలీసు సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.